ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 17 ఫిబ్రవరి 2025



పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

పోటెత్తిన భక్త కోటి

వైభవంగా కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాళ్ల

గార్లదిన్నె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సహస్రనామార్చన, మంత్ర పుష్పం, ఏకవారురుద్రభిషేకం, ఆకుపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ వల్లి, దేవసేన సమేత స్వామివారికి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదిక్షిణలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు ఆంధ్రప్రదేశ్ గాండ్ల, తెలికుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ విశాలాక్షి, విజయభాస్కర్ దంపతులు తీర్థప్రసాదాలు అందజేశారు.




అలంకరణలో చక్రభీమలింగేశ్వరస్వామి

వైభవంగా అశ్వత్థ నారాయణుడి

తిరునాళ్ల

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అశ్వత్థ నారాయణస్వామి, చక్రభీమలింగేశ్వరస్వామి వారి తిరునాళ్ల ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాఘమాసం మూడో ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఉత్తర దక్షిణం నదిలో స్నానాలు చేస్తూ స్వామివారికి తలనీలాలు సమర్పించారు. భక్తులకు జేసీ బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఖరీఫ్‌కు విత్తన ప్రణాళిక



అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాబోవు ఖరీఫ్‌కు సంబంధించి విత్తన ప్రణాళికలను జిల్లా వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ఖరీఫ్‌కు 1,51,698 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు అవసరమని నివేదికలు తయారు చేశారు. ఇందులో 1.45 లక్షల హెక్టార్లకు 133763 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగ అవసరమని ప్రతిపాదించారు. అలాగే 18100 హెక్టార్లకు 8054 క్వింటాళ్ల వరి, 11,500 హెక్టార్లకు 2300 క్వింటాళ్ల మొక్కజొన్న, 5 వేల హెక్టార్లకు 375 క్వింటాళ్ల జొన్న, 2వేల హెక్టార్లకు 60 క్వింటాళ్ల కొర్ర, 34500 హెక్టార్లకు 5347 క్వింటాళ్ల కంది, 16300 హెక్టార్లకు 815 క్వింటాళ్ల ఆముదం, 1700 హెక్టార్లకు 85 క్వింటాళ్ల పొద్దు తిరుగుడు, 1200 హెక్టార్లకు 125 క్వింటాళ్ల ఉలవ, 200 హెక్టార్లకు 24 క్వింటాళ్ల మినుము విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాగా పచ్చిరొట్టి విత్తనాల కింద 250 క్వింటాళ్ల చొప్పున జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల కోసం ప్రతిపాదనలు తయారు చేశారు. త్వరలోనే వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు ఖరీఫ్ విత్తన నివేదికలు పంపనున్నట్లు సమాచారం.

వేడుకగా మహాకుంభాభిషేకం



ప్రధాన హోమ పూర్ణాహుతి నిర్వహిస్తున్న విద్యారణ్య భారతీ స్వామి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం మహాకుంభాభిషేక వేడుకను వైభవంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌తోపాటు ఆలయ గోపురంపై కలశాలకు వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రబద్ధంగా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ప్రధాన హోమ పూర్ణాహుతి, మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు పెద్దఎత్తున అన్నసంతర్పణలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, వెంకటేష్‌గుప్త, ప్రధాన అర్చకుడు ఆలూరు లక్ష్మీనరసింహశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

పోటాపోటీగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతి దూలాన్ని లాగుతున్న ఎద్దులు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 11 జతలు ఎద్దులు పోటాపోటీగా పాల్గొన్నాయి. కర్నూలు జిల్లా తాండ్రపాడుకు చెందిన చిన్నరత్నం ఎద్దులు 5135 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.30 వేలు గెలుచుకున్నాయి. నంద్యాల జిల్లా మాల్యాలకు చెందిన ఎస్ఎస్‌వీ ట్రేడర్స్‌కు చెందిన ఎద్దులు 5100 అడుగులు లాగి రెండో బహుమతి రూ.20 వేలు కైవసం చేసుకున్నాయి. కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం పందికోనకు చెందిన శివకుమార్ ఎద్దులు 4985 అడుగులు లాగి మూడో బహుమతి రూ.10 వేలు సాధించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రంగస్వామి రెడ్డి యాదవ్, నాయకులు చిన్న రెడ్డి యాదవ్, రామచంద్ర, లక్ష్మీరంగయ్య తదితరులు పాల్గొన్నారు.



- రెవెన్యూ సదస్సులు పెట్టినా అంతే..
- పెండింగ్‌లో కుప్పలు తెప్పలుగా అర్జీలు
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ
- మనస్తాపంతో బలవతపు చావుకు యత్నాలు
- ఉన్నతాధికారుల ఉదాసీనతపై విమర్శలు

అంతులేని వ్యథ..!



పరిష్కారం కాని భూ సమస్యలు



● గార్లదిన్నె మండలం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన రైతు సూర్యనారాయణకు అదే మండలం బూదేడు గ్రామ పొలంలో 1.54ఎకరాల భూమి ఉంది. పట్టాదారు పాసు పుస్తకం కోసం ఏళ్ల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో ఆయన గత ఏడాది సెప్టెంబరు 23న కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. అక్కడ కూడా న్యాయం జరగదని మనస్తాపం చెంది కలెక్టరేట్‌లోనే పురుగుల మందు తాగాడు. ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు.



● శింగనమల మండలం సలకంచెరువుకు చెందిన రైతు శివయ్యకు రాచేపల్లి సర్వేనెంబరు467-4లో 2.5ఎకరాల భూమి ఉంది. వైసీపీ పాలనలో రీసర్వే చేయగా 18 సెంట్లు తక్కువ చూపారు. ఆ భూమి మరొకరి ఆధీనంలో ఉంది. న్యాయం చేయాలని ఏడాదిన్నరగా అధికారుల చుట్టూ తిరిగాడు. ఫలితంలేకపోవడంతో వారం కిందట్ల కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు వినతి పత్రం ఇచ్చాడు. అయినా తన సమస్య తీరేటట్లులేదని మనోవేదన చెంది వెంటతెచ్చుకున్న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా కోలుకున్నాడు.



● బెళుగుప్ప మండలం ఎర్రగుడి కొట్టాలకు చెందిన రైతు మాలపాటి వెంకటేష్ పరిస్థితి మరీ దారుణం. వెంకటేష్‌కు ఆవులెన్నగ్రామం సర్వేనెంబరు98లో 3.92ఎకరాల భూమి ఉంది. ఆయనకు ఆర్థిక కష్టాలు రావడంతో రెండేళ్ల కిందట భూమి అమ్మారు. అమ్మిన తర్వాత రీసర్వే చేపట్టారు. ఆసమయంలో ఒకే సర్వే నెంబర్‌లో నలుగురు రైతులకు చెందిన భూములున్నాయి. రీసర్వేలో ఒక కుటుంబానికి చెందిన అన్నదమ్ములు పెండింగ్ పెట్టుకున్నారు. దీంతో రైతు వెంకటేష్ భూమి సర్వే చేసినా ఆయన భూమికి సంబంధించి 1బీ అడంగల్ జారీ చేయలేదు. అధికారుల చుట్టూ రెండేళ్లుగా తిరుగుతున్నా ఇంకో రైతు సమస్య తెగాలి అపుడు ఇస్తామంటున్నారు. వెంకటేష్ భూమికొన్న రైతు ఇంకా రూ.4లక్షలు పెండింగ్ పెట్టి, భూమిని సాగు చేసుకుంటున్నాడు. తనకు రిజిష్టర్ చేయిస్తే మిగిలిన నగదు చెల్లిస్తానంటున్నారు. ఏడాదిన్నరగా అధికారుల చుట్టూ రైతు వెంకటేష్ తిరుగుతున్నా ఈసమస్యకు పరిష్కారం చూపకపోవడంతో మానసికంగా సతమతమవుతున్నారు.

రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న యంత్రాంగం (ఫైల్)

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో జరిగిన భూ అక్ర మాలతో అనేకమంది బాధితులు ప్రస్తుతం తమ సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అన్నదాతల భూ సమస్యలు సత్వరం పరిష్కరించాలని సాక్షాత్తు సీఎం చంద్రబాబు కలెక్టర్లు, ఇతర రెవెన్యూ యంత్రాంగం సమావేశాలలో ఆదేశిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఫలితం కానరావడం లేదు. ఈ నేపథ్యంలో భూ సమస్యలు పరిష్కారం కాక మనోవేదనతో కొందరు రైతులు ఆత్మహత్యకు యత్నిస్తున్నారు. వేలాది మంది కార్యాలయాలు, అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయినా భూ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.



సదస్సులు పెట్టినా..

భూ సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. గ్రామాలకు యంత్రాంగాన్ని పంపించి రైతుల నుంచి భూ సమస్యలపై వినతులు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 33రోజులపాటు 503 రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అనంతపురం డివిజన్‌లో 2,594, గుంతకల్లు డివిజన్‌లో 2,834, కళ్యాణదుర్గం డివిజన్‌లో 1449 అర్జీలు వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఫిర్యాదుల్లో 3698 అర్జీలను పరిష్కరించినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇంకా 3179మంది అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. అనంతపురం డివిజన్‌లో 1235, గుంతకల్లు డివిజన్‌లో 1327, కళ్యాణదుర్గం డివిజన్‌లో 617 అర్జీలు పెండింగ్‌లో ఉన్నా యని అధికారులు చెబుతున్నారు. రెండు నెలలు కావస్తున్నా ఆ సమస్యలు పరిష్కారం కాలేదు. దీంతో రైతులు మళ్లీ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. దీన్నిబట్టి జిల్లా యంత్రాంగం రైతుల భూసమస్యల పరిష్కారంలో ఎంతమేర చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందో అర్థమవుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఉన్నతాధికారుల ఉదాసీనత

భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం చెంది కొందరు రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నా జిల్లా ఉన్నతాదికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టరు, డీఆర్‌ఓ, ఆర్డీఓలు ఉన్నా భూ సమస్యల పరిష్కారం విషయంలో సమీక్షలకే పరిమితం అవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ సదస్సుల బాధ్యత అంతా జాయింట్ కలెక్టరుకు ప్రభుత్వం అప్పగించింది. ఆయన రైతు సమస్యల ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి నిత్యం సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాల్సి ఉంటుంది. అయితే జిల్లా జేసీ అవిధంగా వ్యవహరించలేదని, రైతులు ఆయన వద్దకు వచ్చి తమ బాధలను చెప్పుకుందామన్నా అందుబాటులోకి రావడంలేదనే ప్రచారం జరుగుతోంది. ఇంకో పక్క డీఆర్‌ఓ రెవెన్యూశాఖలో అత్యంతకీలకంగా ఉంటారు. ఈయన నిత్యం ఆర్డీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆయా కార్యాలయాలకు వెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు సూచించాల్సి ఉంటుంది. కానీ ఆ డీఆర్‌ఓ కలెక్టరేట్ వదలి వెళ్లడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టరు వినోద్‌కుమార్ సమీక్షలు పెట్టి ఆదేశాలిస్తున్నా క్షేత్రస్థాయిలో ఫలితాలు రావడం లేదు. బాధ్యతల్లో నిర్లక్ష్యం వహించేవారిపై ఆయన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందనే వాదన జిల్లా అధికార వర్గాలలోనే వినిపిస్తోంది.

నేనే ఫీల్డ్‌కు వెళుతున్నా..



జిల్లాలో వివిధ రకాల భూసమస్యలు ఉన్న విషయం వాస్తవమే. గ్రామ స్థాయిలో కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బందికి సరైన అవగాహన లేక సమస్యలు పరిష్కరించలేకపోతున్నారు. అందుకే ప్రతి గురువారం ప్రత్యేకంగా కాన్ఫరెన్స్ నిర్వహించి భూసమస్యలపై సమీక్షిస్తూ సలహాలు, సూచనలు ఇస్తున్నా. కానీ ఇప్పటికీ సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో ఎక్కువ భూ సమస్యలు ఉన్న 25 మండలాలలో నేనే స్వయంగా భూసమస్యలపై పరిశీలనకు ఫీల్డ్‌కు వెళుతున్నా. ఇప్పటికే ఇందుకు ఓ ప్రణాళిక ఏర్పాటు చేసుకుంటున్నా. అక్కడ కావాలనే అధికారులు నిర్లక్ష్యం చేసి ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటా. ఇదే సమయంలో రైతు కుటుంబాల అన్నదమ్ముల మధ్య వివాదాలు ఉండడం వల్ల కూడా ఈసమస్యలు పెండింగ్‌లో ఉండటానికి కారణమవుతున్నాయి. ఆరైతు కుటుంబసభ్యులు సహకరిస్తే ఈ భూసమస్యలు తగ్గడానికి అవకాశం ఉంటుంది.

● వినోద్‌కుమార్, జిల్లా కలెక్టరు



బాలోత్సవంలో ఓ విద్యార్థిని ప్రదర్శన.

వేతనాల కోసం కార్మికుల సమ్మెబాట

నేటి అర్ధరాత్రి నుంచి శ్రీరామి రెడ్డి తాగునీరు బంద్

ఉమ్మడి జిల్లాలో 850 గ్రామాలకు ఇబ్బందులే!

7

పొరపాటా.. బాధ్యతారాహిత్యమా..?

- ఫార్మసిస్టును లోపల పెట్టి తాళం
- పెద్దాస్పత్రిలో మందుల కోసం రోగుల నిరీక్షణ
- రెండు గంటల తర్వాత గుర్తించిన వైనం..

వివరాలు 7



ముగింపు సభలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేస్తున్న ఆర్ఐఓ వెంకటరమణ నాయక్

అబ్బురం.. బాలల సంబరం

అట్టహాసంగా ముగిసిన అనంత బాలోత్సవం

7

పది ఎకరాలున్నా సబ్సిడీపై డ్రిప్

సీఎం వద్ద ప్రతిపాదిస్తాం: ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు పది ఎకరాల వరకు సబ్సిడీ డ్రిప్ పరికరాలు అందించేలా సీఎం చంద్రబాబునాయుడు వద్ద ప్రతిపాదిస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నియోజకవర్గ రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి అర్హులైన రైతులందరికీ సబ్సిడీ డ్రిప్ పరికరాలు అందజేస్తామన్నారు. అనంతపురం జిల్లా కరువు నేపథ్యంలో 90 శాతం సబ్సిడీపై డ్రిప్ అమలుకు ప్రయత్నిస్తామన్నారు. తీవ్రమైన ఒడిదుడుకుల మధ్య సాగుతున్న వ్యవసాయ రంగాన్ని గాడిన పెట్టడానికి వాజ్‌పేయి ప్రభుత్వం 1999-2004 మధ్య చంద్రబాబు నేతృత్వంలో ఓ టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసిందని వివరించారు. దేశంలో నదీజలాల వినియోగం, ఆయకట్టు సాగు విస్తీర్ణంపై సుదీర్ఘమైన, శాస్త్రీయ అధ్యయనం జరిగిందన్నారు. సూక్ష్మ సాగునీటి వాడకంపై దృష్టి పెట్ట గలిగితేనే సాగు విస్తీర్ణం పెరుగుతుందని టాస్క్‌ఫోర్స్ కమిటీ సిఫార్సు చేసిందన్నారు. దాంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ సబ్సిడీపై సూక్ష్మ సాగునీటి పరికరాల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. 2014-19 టీడీపీ పాలనలో అనంతపురం జిల్లాలో అత్యధిగా దాదాపు 80 వేల మంది రైతులకు చెందిన దాదాపు రెండు లక్షల ఎకరాల్లో సబ్సిడీ సూక్ష్మ సాగునీటి పరికరాలు అమర్చినట్లు వివరించారు. రైతుల ఆశలకు అనుగుణంగా చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తమపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన వారి కోసం తాము కూడా అంతే బాధ్యతతో పనిచేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ సహాయ సంచాలకులు ఫిరోజ్‌ఖాన్, వ్యవసాయ అనుబంధ, ఉద్యాన సిబ్బంది, మండల టీడీపీ అధ్యక్షుడు కురుబ హనుమంతు, లాలెప్ప, కురుబ గిరిమల్లప్ప పాల్గొన్నారు.



డ్రిప్ పరికరాలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

నేడు రాయదుర్గంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

సీతారామాంజనేయ కల్యాణ మండపంలోకి వేదిక మార్పు

- కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికను సోమవారం రాయదుర్గంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. అయితే ముందుగా నిర్ణయించిన వేదికను మార్చి సీతారామాంజనేయ కల్యాణమండపంలో ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు ప్రజా సమస్యలకు సంబంధించి వినతులు స్వీకరిస్తామని తెలిపారు. తనతోపాటు ఇతర అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ఈ అవకాశాన్ని రాయదుర్గం డివిజన్ ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని కలెక్టరు కోరారు.

వేతనాల కోసం కార్మికుల సమ్మెబాట

నేటి అర్ధరాత్రి నుంచి శ్రీరామిరెడ్డి తాగునీరు బంద్

ఉమ్మడి జిల్లాలో 850 గ్రామాలకు ఇబ్బందులే..!



పీఏబీఆర్ వద్ద కార్మికులతో మాట్లాడుతున్న ఓబులు

కూడేరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆరునెలల వేతనాలు, 30 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మె బాట పట్టారు. మండలంలోని పీఏబీఆర్ డ్యాంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్రాజెక్టు వద్ద ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ తాగునీటి ప్రాజెక్టులో దాదాపు 600 మంది కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. దీంతో కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి పంపులు బంద్ చేసి సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో కళ్యాణదుర్గం, రాయదుర్గం, బెళుగుప్ప, పరిగి, హిందూపురం, మడకశిర డివిజన్‌లలోని 850 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. వేతనాలు చెల్లించకపోతే కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని, ఈ విషయంపై పలుమార్లు కాంట్రాక్టర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. అందుకే సమ్మెకు సిద్ధమైనట్లు తెలిపారు. అనంతరం కార్మికుల డిమాండ్లతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయనతోపాటు కార్మిక సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి, నాగరాజు, రవి, కాసీం, కొండారెడ్డి, ఈశ్వర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 375 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి మున్సిపల్ సమస్యలపై ఉద్యమం



మాట్లాడుతున్న రాజేష్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలపై సోమవారం నుంచి ఉద్యమం చేపట్టనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ, భద్రతను ఏజెన్సీలు, ప్రైవేట్ కంపెనీలకు కాకుండా మున్సిపల్ శాఖకే పూర్తిగా కేటాయించాలన్నారు. ప్రైవేట్‌కు అప్పగించాలన్న ఆలోచనను పూర్తిగా విరమించుకోవా లన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా ఇప్పటి వరకూ కార్మికుల సమస్యలు ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. నగరాలు, పట్టణాల్లో పెరిగిన జనాభా మేరకు కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్న తదతర డిమాండ్ల సాధనకు ఉద్యమిస్తామన్నారు. ఈ నెల 17 నుంచి దశల వారీగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, జిల్లా కోశాధికారి వేణుగోపాల్, జిల్లా సమితి సభ్యులు ప్రసాద్, సాగర్, ధనుంజయ పాల్గొన్నారు.

ఎస్ఐ పేరుతో బెదిరింపులు..!

బంగారు వ్యాపారులకు ఫోన్లు... డబ్బు కోసం డిమాండ్..



నకిలీ ఎస్ఐ నరేంద్రరెడ్డి

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నేను కళ్యాణదుర్గం ఎస్ఐను... మీ దుకాణంలో దొంగ బంగారం ఉందని సమాచారం అందింది. వెంటనే పోలీస్ స్టేషన్‌కు డబ్బులతో వచ్చి సమస్యను పరిష్కరించుకోండి. లేదంటే కేసు నమోదు చేస్తానని బంగారు దుకాణ యజమానులకు ఓ నకిలీ ఎస్ఐ బెదిరించాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై పట్టణ సీఐ యువరాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఓ మోసగాడు దీన్ని ఆసరాగా చేసుకున్నాడు. తాను కళ్యాణదుర్గం టౌన్ ఎస్ఐ నరేంద్రరెడ్డి అని 7670994788, 8008635488 నంబర్లతో కడప, గుంటూరుకు చెందిన ఇద్దరు బంగారు వ్యాపారులకు ఫోన్లు చేశాడు. మీరు దొంగ బంగారం కొన్నారు, దొంగలు పట్టుబడి మీ పేర్లు చెప్పారు. స్టేషన్‌కు వస్తే విచారణ చేయాలని బుకాయించాడు. డబ్బులు తీసుకురాకపోతే కేసులు పెట్టి అరెస్టు చేస్తానని బెదిరించాడు. అలాగే అనంతపురానికి చెందిన ఓ టైలర్‌కు ఫోన్‌చేసి మీ ఇంట్లో దొంగతనం జరిగింది కదా ఇందుకు సంబంధించి దొంగలు దొరికారు. బంగారం రికవరీ అవుతుంది, మీరు డబ్బులు ఇవ్వాలని మభ్యపెట్టాడు. ఇద్దరు వ్యాపారులు, సదరు బాధితుడు కళ్యాణదుర్గం టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్ఐ నరేంద్రరెడ్డి ఎక్కడున్నారని టౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని అడిగారు. ఇక్కడ ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉందని, అలాంటి వ్యక్తులు ఎవరూలేరని చెప్పడంతో ఖంగుతిన్నారు. ఈ విషయాన్ని పోలీస్ సిబ్బంది సీఐ దృష్టికి తీసుకెళ్లడంతో నకిలీ ఎస్ఐ బాగోతం వెలుగు చూసింది. ఇలాంటి వారిని నమ్మవద్దని చెప్పి సీఐ బాధితులను తిరిగి పంపించేశారు. మోసగాడి నంబర్లకు ఫోన్ చేస్తే తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ ప్రాంతంగా చూపుతోందని పోలీసులు గుర్తించారు. ఆదిలాబాద్‌లోనూ ఇదే విధంగా చేశాడని ఉన్నతాధికారుల ద్వారా సమాచారం తెలుసుకున్నట్లు సీఐ తెలిపారు. ఇప్పటివరకు బాధితులు ఎవరూ నకిలీ ఎస్ఐకి డబ్బులు ఇవ్వలేదన్నారు. ప్రజలు నకిలీల బారిన పడి మోసపోవద్దని, ఏవైనా సందేహాలుంటే పోలీస్‌స్టేషన్‌కు నేరుగా వచ్చి తెలుసుకోవాలని సీఐ సూచించారు.

అబ్బురం.. బాలల సంబరం

అలరించిన నృత్యం





సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఓ సన్నివేశం

అట్టహాసంగా ముగిసిన అనంత బాలోత్సవం

మూడు రోజులు... ఏడు వేల మంది విద్యార్థులు



నాట్యం భళా..

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): 'అనంత బాలోత్సవ' సంబరం ఆదివారం ముగిసింది. ఉత్సవాల్లో భాగంగా మూడురోజుల పాటు అనంతపురంలోని లలితకళా పరిషత్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ ప్రాంగణాలు పిల్లల ఆటపాటలతో సందడిగా మారాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేలాది విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను చాటుకునేందుకు పోటీపడ్డారు. వారిని ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆరాటపడ్డారు. నిత్యం చదువుల్లో మునిగితేలే విద్యార్థులకు ఈ మూడురోజుల ఆటవిడుపు నూతనోత్తేజం నింపింది. వారి ప్రదర్శనలు చూసి వీక్షకులు ఎంతో ముచ్చటపడ్డారు.

సృజనను వెలికితీసేందుకు దోహదపడతాయి

- వెంకటరమణ నాయక్, ఆర్ఐఓ

పిల్లల్లో దాగున్న ప్రతిభతోపాటు సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు. బాలోత్సవ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మూడు రోజులపాటు ఇంతటి చక్కటి వాతావరణంలో బాలోత్సవాన్ని సజావుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎల్‌కేపీ కార్యదర్శి పద్మజ, బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా, కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొండయ్య, మానవత రక్తదాతల సంస్థ తరిమెల అమరనాథరెడ్డి, బాలోత్సవ కమిటీ సభ్యులు ఓతూరు పరమేష్, రమణయ్య, గోవిందరాజులు, కోటేశ్వరప్ప, లింగమయ్య, సుబ్బరాయుడు, సరళ, దేవేంద్రమ్మ పాల్గొన్నారు.

అవినీతి రాజకీయ నాయకుల

ఆస్తులు జప్తు చేయాలి

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి



మాట్లాడుతున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అవినీతి రాజకీయ నాయకుల ఆస్తులను జప్తు చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొందరు రాజకీయ నాయకుల అక్రమాలపై కేసులున్నపుడు రాజకీయ జోక్యంతో, అర్థ, అంగ బలాలతో కొంతకాలం కాలయాపన చేస్తూ బయట స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులున్నాయన్నారు. దీనిపై అవే సంస్థ ఆధ్వర్యంలో సామాజికవేత్తలతో సమావేశమై ఈ అంశంపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. దేశంలో, రాష్ట్రంలో అవినీతి పరలైన రాజకీయ నేతలపై సత్వరం చర్యలు తీసుకునేలా కేంద్రం జోక్యం చేసుకోలని ప్రధాని మోదీని కోరతామన్నారు.

కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపులు ఉండవు

కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపులకు తావులేదని వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసిన కేసులోనే చట్టపరంగా వల్లభనేని వంశీని అరెస్టు చేశారన్నారు. వేధింపులు, కక్షసాధింపు, చట్టపరంగా చర్యలకు వ్యత్యాసాన్ని అన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలని కోరారు. వంశీని హైదరబాద్ నుంచి నేరుగా గన్నవరం స్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. గత ప్రభుత్వంలో అచ్చెన్నాయుడు, ఇతర నాయకులపై కక్ష సాధింపులో భాగంగా అక్రమంగా అరెస్టు చేయడంతోపాటు సుదూర ప్రాంతాలకు తిప్పి వేధించారన్నారు.

ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందే వైసీపీ

హంద్రీనీవా లైనింగ్ పనులు అడ్డుకుంటామనడం శోచనీయం

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

అనంతపురం, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందే వైసీపీ అన్న విషయాన్ని ఆ పార్టీ నాయకులు మరిచిపోయి మాట్లాడటం దారుణమని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి గంపెడు మట్టి తీసిన పాపాన పోలేదన్నారు. అనంతపురంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కూటమి అధికారంలోకి రాగానే ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చివరి ఆయకట్టుకు నీరు చేరాలన్నా, చెరువులు నింపాలన్నా లైనింగ్ అవసరమన్నారు. ఐదేళ్లలో హంద్రీనీవా నుంచి చుక్క నీరు కూడా రాప్తాడుకు తీసుకురాలేని వైసీపీ నాయకులు ప్రాజెక్టుల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా లైనింగ్ కోసం టెండర్లు పిలిచినా.. పనులు చేయలేదన్నారు. ప్రతిపక్ష నేత హోదాలో 2019కి ముందు జగన్‌రెడ్డి ఉరవకొండలో దీక్ష చేయడంతో పాటు.... తాము అధికారంలోకి వస్తే... హంద్రీనీవా పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ఆ పార్టీ నాయకులు మరచిపోయి మాట్లాడటం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టునైనా సందర్శించారా అని వైసీపీ నాయకులను నిలదీశారు. ప్రాజెక్టులను నాశనం చేసింది చాలక, లైనింగ్ పనులను అడ్డుకుంటారా అంటూ ధ్వజమెత్తారు. కుప్పంలో నీళ్ల వదిలినట్లు డ్రామాలాడిన చరిత్ర వైసీపీదేనన్న విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తుంచుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. కాగా, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టు వ్యవహారంలో ప్రభుత్వం ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని ఆయన స్పష్టం చేశారు. నిందితులను చట్టం పరిధిలోనే ప్రభుత్వం శిక్షిస్తోందన్నారు.

పొరపాటా.. బాధ్యతారాహిత్యమా..?

ఫార్మసిస్టును లోపల పెట్టి తాళం

పెద్దాస్పత్రిలో మందుల కోసం రోగుల నిరీక్షణ

రెండు గంటల తర్వాత గుర్తించిన వైనం..

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): డ్యూటీలో ఉన్న ఫార్మసిస్టును లోపలపెట్టి తాళం వేశారు. దీంతో మందుల కోసం రోగులు, వారి బంధువులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఈ సంఘటన జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఆదివారం ఓపీ ఉండదు. క్యాజువాలిటీలోనే సాధారణ రోగులకు డాక్టర్లు పరీక్షించి మందులు రాసిస్తారు. 14వ నెంబరు గదిలో పగటి పూట మందులు ఇస్తారు. అయితే ఆదివారం ఆస్పత్రిలో ప్రతిరోజు మందులుఇచ్చే ప్రధాన కౌంటర్‌లోనే ఫార్మసిస్టు ఉంటూ మందులు ఇస్తున్నారు. కానీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆ మందులు ఇచ్చే ప్రధాన కౌంటర్‌కు వెళ్లే దారికి ఉన్న గేటుకు తాళం వేసేశారు. అప్పటికీ ఫార్మాసిస్టు డ్యూటీలోనే లోపల ఉన్నారు. ఈవిషయం తెలియక రోగులు, వారి కుటుంబసభ్యులు మందుల కోసం 14వ నెంబరు గదికి వెళ్లారు. అక్కడ తాళం వేసి ఉంచారు. ప్రధాన కౌంటరుకు వెళ్లే ప్రధాన ఇనుపగేటుకు తాళం వేసి ఉంచారు. దీంతో ఎక్కడా మందులు లభించక దాదాపు రెండున్నర గంటల పాటు పడిగాపులు కాశారు. ఎవరిని అడిగినా సరైన సమాధానం రాలేదు. ఆ సమయంలో అక్కడకి వెళ్లిన విలేకరులకు బాధితులు ఈ విషయం తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టరు హేమలత దృష్టికి తీసుకెళ్లగా వారు వైద్య సిబ్బంది విషయం గురించి ఫోన్‌లో ఆరా తీశారు. అప్పుడు లోపలున్న ఫార్మసిస్టు బయటకురాగా అక్కడ ప్రధానగేటుకు తాళం వేసి ఉన్న వ్యవహారాన్ని గుర్తించారు. ఆ తర్వాత ఓ సెక్యూరిటీ గార్డు వచ్చి తాళం తీశారు. దీంతో మందుల కోసం వేచి ఉన్న వారి నిరీక్షణకు తెరపడింది. ఆస్పత్రిలో సిబ్బంది బాధ్యతారాహిత్యానికి ఈ సంఘటన నిదర్శనమని పలువురు రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఫార్మసిస్టును లోపల పెట్టి తాళం వేసిన దృశ్యం

కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే బడ్జెట్

వామపక్ష నాయకుల ధ్వజం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేలా ఉందని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్, ప్రత్యామ్నాయ విధానాలపై సదస్సు నిర్వహించారు. సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సురేష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారమన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రూ.50 లక్షల కోట్లు అన్నారు. ఈ బడ్జెట్ కేవలం కార్పొరేట్ సంస్థలకు కోసం కేటాయించినట్లు ఉందని ధ్వజమెత్తారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్‌సింగ్‌లు రూ.52 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. 11 సంవత్సరాల్లో ప్రధానమంత్రి మోదీ చేసిన అప్పు రూ.155 లక్షల కోట్లు అన్నారు. ఇంత అప్పుచేసిన మోదీ దేశంలో పరిశ్రమలు, ప్రాజెక్టులు కట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా బాబులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను ప్రధాని రూ.14లక్షల 46వేల కోట్లు మాఫీ చేశాడని విమర్శించారు. మనరాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశాడని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీలో మన ఎంపీలు ధర్నాలు చేయాలని సూచించారు. విభజన చట్టంలోని హామీలు భాగంగా రాయలసీమలో రైల్వేజోన్, వెనుకబడిన ప్రాంతాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం అన్నారు. విశాఖ ఉక్కుపరిశ్రమకు ఖనిజ సంపద కేటాయించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మహేష్, గోపినాథ్, ఎస్ఎండీ గౌస్, రాము, రామాంజనేయులు, సీపీఎం శ్రీనివాసులు, మారుతిప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంభూపాల్

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పెనుకొండ రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి శనివారం రాత్రి రాజధాని రైలు కింద పడినట్లు ఆ రైలు లోకోపైలెట్ సమాచారం అందించినట్లు తెలిపారు. హిందూపురం రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెనుకొండ ప్ర భుత్వ ఆసుపత్రికి తరలించారు. మృ తుడికి 35 సంవత్సరాల వయసు ఉంటుందన్నారు. మృతదేహంపై పచ్చరంగు టీషర్ట్, నల్ల ప్యాంటు ఉన్నాయన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే హిందూపు రం రైల్వే పోలీస్ 9441238182, 9440 627641లకు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు..



లక్ష్మీనారాయణ (ఫైల్)

గార్లదిన్నె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదాసుపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున లగేజీ ఆటోను ఐషర్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ (40) అనే రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు శింగనమల మండలం నిదనవాడకు చెందిన లక్ష్మీనారాయణ తనకున్న కొంత భూమిలో వ్యవసాయం చేసుకునేవాడు. ఇటీవల లగేజీ ఆటోను కొనుక్కుని గ్రామంలో చిన్న చిన్న బాడుగులకు తిప్పేవాడు. అయితే తన గేదెను అమ్మడానికి అనంతపురం సంతకు లగేజీ ఆటోలో డ్రైవర్ అశోక్‌తో కలిసి బయల్దేరాడు. రామదాసుపేట వద్ద ఆటోను వెనుక వైపు నుంచి ఐషర్ వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రైతు లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య దేవి, ముగ్గురు పిల్లలున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో డ్రైవర్ అశోక్, గేదె సురక్షితంగా బయటపడ్డారు.

అమిద్యాలలో భారీ చోరీ

20తులాల బంగారు ఆభరణాలు, రూ.1.5లక్షల నగదు అపహరణ



తెరిచి ఉన్న బీరువా

ఉరవకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమిద్యాల గ్రామంలో దర్జీ నారాయణరావు అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. ఇంట్లో 20 తులాల బంగారు, రూ.1.50లక్షల నగదును గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. నారాయణరావు అతని భార్య సరస్వతితో కలిసి 20 రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి బెంగళూరులో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు, నగదును దోచుకెళ్లారు. బాధితుడు ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉండడం, బీరువాలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి పూజలు


మూడో రోడ్డులోని సంకష్ట గణపతి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మాఘ బహుళ చవితిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో సంకష్ట చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడో రోడ్డు షిర్డీసాయి ఆలయం, మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, మల్లేశ్వరరోడ్డు లోని లక్ష్మీగణపతి మందిరం తదితర ఆలయాల్లో గణనాథుడి మూలవిరాట్లకు పంచామృతాభిషేకం చేశారు. కుడుముల మాలలు, వివిధ రకాల పుష్పాలు, గరికతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు సంకష్టహర వ్రతం ఆచరించారు. ఆలయాల కార్యవర్గాల వారు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న అక్కులప్ప

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా దళిత ఉద్యమాలు సాగిస్తున్న ఎమ్మార్పీఎస్ అక్కులప్పను డేస్ప్రింగ్ లండన్ అనుబంధ హెచ్‌ఎస్‌సీ యూనివర్సిటీ డాక్టరేట్‌తో సత్కరించింది. విద్యార్థులతో పాటు వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందించిన వారికి హెచ్‌ఎస్‌సీ హైదరాబాద్ వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఇందులో భాగంగా తనును గుర్తించి డాక్టరేట్ ఇచ్చారని అక్కులప్ప హర్షం వ్యక్తంచేశారు. డాక్టరేట్‌ను పుచ్చుకోవడంతో సామాజిక బాధ్యత మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు.

గణిత ఉపాధ్యాయుడికి...


నారాయణ నాయక్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ నుంచి తాను డాక్టరేట్ పొందినట్లు గణితం స్కూల్ అసిస్టెంట్, ఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ నాయక్ ఆదివారం తెలిపారు. అప్లైడ్ మ్యాథమేటిక్స్ విభాగంలో 'సిగ్నిఫికెన్స్ ఆఫ్ థర్మల్ రేడియేషన్ ఆన్ డిఫరెంట్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్ ఫోస్ ఓవర్ ఏ స్ట్రెచ్చింగ్ సీట్ అండ్ వేరియస్ బ్రౌండీ కండీషన్స్' అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. డాక్టర్ సునీత పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేశారు. నారాయణ నాయక్ రాసిన పలు వ్యాసాలు అంతర్జాతీయ జనరల్స్‌లో ప్రచురితం అయ్యాయి. డాక్టరేట్ పొందడంతో వైవీయూ వీసీ కృష్ణారెడ్డి ఆ సంఘం నాయకులు, పలువురు టీచర్లు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి కుటుంబసభ్యులు డబ్బులివ్వలేదని మనస్తాపానికి గురై నగరంలోని ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు అనంతపురం రూరల్ పోలీసులు తెలిపారు. నగర శివారులోని పాపంపేటకు చెందిన వెంకటేశు(49)ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన వెంకటేశు అది లేకుండా ఉండలేని పరిస్థితికి వచ్చాడు. ఆటో తోలేందుకు కూడా సరిగా వెళ్లేవాడు కాదు. ఈ క్రమంలో మద్యానికి డబ్బు కోసం తల్లి, భార్యను సతాయించే వాడు. ఆదివారం డబ్బు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలోగాయపడిన వ్యక్తి

రామగిరి/చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండల సరిహద్దున ఉన్న జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం కారు బోల్తాపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరుకు చెందిన మైకెల్ ఫెర్నాండెజ్ మరొకరితో కలిసి అనంతపురం నుంచి కారులో బెంగళూరు వెళ్తున్నాడు. ఎన్‌ఎస్ గేటు సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో మైకెల్ ఫెర్నాం డేజ్‌కు తీవ్రగాయాలు కాగా మరో వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు. గాయపడిన వ్యక్తిని ప్రైవేటు వాహనంలో అనంతపురం లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్టు సీకేపల్లి ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. కాగా ఈ ఘటనలో కారు దెబ్బతింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నార్పల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని నార్పల క్రాసింగ్ సమీపంలో ఆనందాచారి(46) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడు నార్పలలోని దిగుమర్రి రోడ్డులో నివాసముండే వాడు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడేవాడని కుటుంబీకులు తెలిపారు. అయితే ముక్కు నుంచి రక్తం రావడంతో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగిందా, మరేమైనా కారణాలు ఉన్నాయా అని పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

శిల్పారామంలో సాంస్కృతిక ప్రదర్శనలు


నృత్యం చేస్తున్న కళాకారులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నగరానికి చెందిన దివ్యశ్రీ ఆధ్వర్యంలో భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్, నృత్య కళాకారులు ఉపాస్య, మేఘన, శాన్వి, ప్రణవి, భూమిక, అద్వైత, రుహిక నివాస్వి, వార్షిక, కీర్తి, సహస్ర, సృజన, హిషిక, లాస్య ప్రియ పాల్గొన్నారు.

ఘనంగా అశ్వత్థనారాయణ తిరునాళ్ల


అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి


స్వామి దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోములదొడ్డి గ్రామ సమీపంలోని తడకలేరులో వెలసిన అశ్వత్థనారాయణస్వామి తిరునాళ్ల కన్నుల పండువగా సాగాయి. మాఘమాసం మూడో ఆదివారం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి తెల్లవారుజామున విశేషపూజలు నిర్వహించారు. అభిషేకాలు, అలంకరణ అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బోనాలు సమర్పించారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. తినుబండారాలు, పిల్లల ఆటవస్తువులు, గాజులు ఇతరత్ర వాటిని కొనుగోలు చేస్తూ సందడి చేశారు. తిరునాళ్లను పురస్కరించుకుని పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోములదొడ్డి, పాముఠాయికి చెందిన టీడీపీ నాయకులు ఉచితంగా మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.

ప్రజలు తిరస్కరించినా మారరా?

- వైసీపీ నాయకులపై ఎమ్మెల్యే దగ్గుపాటి మండిపాటు
- బాబాజీ, ఇసాక్‌తోపాటు 500 మంది టీడీపీలో చేరిక


బాబాజీ, ఇసాక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గంలోని వచ్చిన 47 రోజుల్లోనే 23వేల ఓట్ల మెజార్టీతో మిమ్మల్ని ఓడించానని, అయినా మీ తీరులో మార్పు రాలేదంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వైసీపీ నేతలపై మండిపడ్డారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం 22వ డివిజన్‌కు చెందిన వైసీపీ మైనార్టీ నాయకుడు కట్టుబడి బాబాజీ, న్యాయవాది ఇసాక్‌తో పాటు 500 మంది టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, మంత్రి నారాలోకేశ్ కార్యకర్తలకు ఇస్తున్న ప్రాధాన్యతను చూసి వైసీపీ నుంచి టీడీపీలోకి అనేక మంది వస్తున్నారన్నారు. గతంలో వైసీపీకి నమ్మకంగా పనిచేసిన బాబాజీకి అన్యాయం చేయడం బాధాకర మన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంతకు సన్నిహితంగా ఉన్న ఇసాక్ టీడీపీలో చేరడం చూస్తుంటే వైసీపీలో ఏ ఒక్క కార్యకర్తకు సరైన న్యాయం జరగడం లేదని స్పష్టమవుతోందన్నారు. వచ్చే రంజాన్ మాసంలోగా మసీదుల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. నగర మేయర్ వసీం తన అంకుల్ మాటలు వింటూ ఏది పడితే అది మాట్లాడటం సరి కాదన్నారు. గతంలో మీలో ఎవరైనా జనంలో తిరిగారా అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు. మీరు ఏమీ చేయలేదు కాబట్టే ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారని అన్నారు. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజల కోసం పనిచేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్‌మొద్దీన్, చంద్రదండు ప్రకాష్‌నాయుడు, ముక్తియార్, గంగారామ్, బాబా ఫకృద్దీన్, జెఎం బాషా, స్వామిదాస్, రాయల్ మురళీ, డిస్కో బాబు, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పీఎల్‌ఎన్ మూర్తి, పరమే శ్వరన్, గోపాల్ గౌడ్, చేపల హరి, మారుతీనాయుడు, వెంకటేశ్వరరెడ్డి, నెట్టెం బాలకృష్ణ, జైనుబ్బి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

- రాయలసీమ బలిజ సంఘం యువజన విభాగం


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బలిజ సంఘం యువత

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ దేవరాయల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాయలసీమ బలిజ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు రమేష్ రాయల్ పిలుపునిచ్చారు. శ్రీకృష్ణ దేవరాయల జయంతిని పురస్కరించుకుని ఆదివారం రాయలసీమ బలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో మున్నా నగర్ నుండి సప్తగిరి సర్కిల్, సుభాష్‌రోడ్డు, క్లాక్‌టవర్, ఆర్ట్స్ కాలేజీ మీదుగా శ్రీనివాస్‌నగర్ బాలాజి కల్యాణమండపం వరకు దాదాపు 500 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పావురాల శేఖర్, ఆనంద్, గురుమూర్తి, రవి, ధ్రువ, నాగేంద్ర, రాజేష్, రేవంత్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

- రామగిరి: మండలపరిధిలోని కుంటిమద్ది గ్రామంలో శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఆదివారం బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల చిత్రపటాన్ని ఊరేగించారు. బలిజ సంఘం నాయకులు మాట్లాడుతూ కృష్ణదేవరాయల పాలన పలువురికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

నేడు ఎస్కేయూలో శ్రీకృష్ణదేవరాయల జయంతి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను సోమవారం ఎస్కేయూలో నిర్వహించనున్నట్లు సమాజశాస్త్ర విభాగం సహాయ ఆచార్యులు రామిరెడ్డి తెలిపారు. భువన విజయం ఆడిటోరియంలో జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, గౌరవ అతిథులుగా రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు హాజరవుతారని తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయ ప్రతిభా పురస్కారం ప్రదానం


పురస్కారం అందుకుంటున్న సుంకర రమేష్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు సుంకర రమేష్‌కు శ్రీకృష్ణదేవరాయ ప్రతిభా పురస్కారం దక్కింది. శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా ఆదివారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డి, సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు బాలాజా, ప్రైడ్ ఇండియా కల్చరర్స్ సీఈఓ కోలా వెంకటేశ్వరరావు నుంచి అవార్డు అందుకున్నారు. పదిహేనేళ్లుగా అనేక సామాజిక సేవలతో పాటు సాహిత్యం, కళలపై అవగాహన కల్పించిన ఆయనకు గుర్తింపు లభించింది. అవార్డు అందుకున్న రమేష్‌కు అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జేఎల్ మురళీధర్, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ రమేష్ నారాయణ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి భరత్ అభినందనలు తెలిపారు.

నాయీబ్రాహ్మణ సభకు తరలిరండి

రామగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన గోరంట్లలో ఈ నెల 18వ తేదీన నిర్వహించే నాయీబ్రాహ్మణుల విజయభేరి సభను విజయవంతం చేయాలని నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. ముఖ్యఅతిథులుగా మంత్రి సవిత, ఎంపీ పార్థసారథితో పాటు పలువురు ముఖ్యనాయకులు హాజరవుతారని ఆయన తెలిపారు. మండలంలోని నాయీబ్రాహ్మణులందరూ తరలిరావాలని కోరారు.

త్రయంబకేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్యే


త్రయంబకేశ్వర క్షేత్రంలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒక్కటైన మహా రాష్ట్రలోని త్రయంబకేశ్వర క్షేత్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించు కున్నారు. క్షేత్రంలోని పరమేశ్వరుడి దర్శనం తర్వాత ఎంతో మానసిక ప్రశాంతత ఏర్పడిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జ్యోతిర్లింగాల్లో ఒక్కటైన ఈ క్షేత్రాన్ని దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆ పరమశివుడి కృప ఏపీ ప్రజలపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

నేడు రాప్తాడుకు ఎమ్మెల్యే రాక

రాప్తాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాప్తాడులో నీలకంఠేశ్వ రస్వామి ఆలయం వద్ద సోమవారం ఉదయం 10:30 గంటలకు సీసీ రోడ్డు భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ముఖ్య అతిథిగా హాజరవుతారని పంచాయతీరాజ్ ఏఈ కిషోర్‌కుమార్ ఆదివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 17 లక్షలు మంజూరయ్యాయన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

బీసీ వసతిగృహంలో సరస్వతి పూజ


సరస్వతి పూజలో పాల్గొన్న అధికారులు, ట్యూటర్లు, విద్యార్థినులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని గిల్డాఫ్ సర్వీస్ స్కూల్ సమీపంలోని బీసీ బాలికల ప్రీమెట్రిక్ వసతిగృహంలో సరస్వతి పూజ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వసతిగృహ వార్డెన్ మాధవి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పూజా కార్యక్రమానికి బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ, ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సరస్వతిదేవి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. డీడీ కుష్బూకొఠారీ మాట్లాడుతూ... పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాల ని సూచించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఆకట్టు కున్నాయి. కార్యక్రమంలో ట్యూటర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'తాగు, సాగునీరు సమృద్ధిగా ఇవ్వాలి'

శింగనమల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రతి ఎకరానికి సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలోని ఫిబ్రవరి 22 నుంచి 24 వరకు రాయలసీమ ప్రాజెక్టులపై నిర్వహించే మహాసభ పోస్టర్లను శింగనమలలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం విడుదల చేశారు. రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలన్నారు. నాయకులు మధుయాదవ్, వెంకటరెడ్డి, నేసే మధు, బయన్న, రామాంజి, కోనప్ప పాల్గొన్నారు.

పార్కింగ్‌కు అడ్డాగా పెన్నార్ భవన్

- పట్టించుకోని అధికారులు


పెన్నార్ భవన్ కాంపౌండ్‌లో పార్కింగ్ చేసిన కార్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమీపంలోనున్న పెన్నార్ భవన్‌లో ఎస్సీ గిరిజన సంక్షేమ శాఖలతో పాటు ఎస్సీ కార్పొరేషన్ భవనాలు ఉన్నాయి. నిత్యం జనాలతో రద్దీగా ఉండే ప్రాంతం అది. విశాలంగా ఉన్న ఆవరణం ఆ ప్రాంత కార్యాలయ ఉద్యోగుల వాహనాలకు పార్కింగ్‌కు ఏ మాత్రం ఇబ్బంది ఉండదు. అయితే సమీప ప్రాంతాల్లోని ప్రజలు, అటువైపు వెళ్లే వాళ్ల వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయింది. నిత్యం ఎవరో ఒకరు వచ్చి ఆ కాంపౌండ్‌లో కార్లు, ట్రాక్టర్లు, మినీ వ్యాన్‌లు, టూవీలర్లు పార్కింగ్ చేసి వెళ్తున్నారు. గురువారం ఆంధ్రజ్యోతి పరిశీలనలో... పెన్నార్ భవన్ కాంపౌండ్‌లో ఇతరుల ట్రాక్టర్లు, కార్లు పార్కింగ్ చేయడం కనిపించింది. ఈ విషయంలో పట్టించుకోవాల్సిన అధికారులు తమ కేమీ సంబంధం లేదన్న ట్లుగా వ్యవహరిస్తుండటమే ఇందుకు కారణమని పలువురు ఉద్యోగులు వా పోతున్నారు. మరోవైపు ఆ పెన్నార్ భవన్‌కు రాత్రివేళల్లో గస్తీ నిర్వహించే సెక్యూరిటీ గార్డు నిర్లక్ష్యం కూడా కారణం అంటున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి పెన్నార్ భవన్ కాంపౌండ్‌లో ఉద్యోగు వాహనాలు తప్ప ఇతర వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శింగరప్ప స్వామి తిరునాళ్ల


పూజలందుకుంటున్న శింగరప్ప స్వామి

గార్లదిన్నె, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరు వద్ద పెన్నానది పరివాహక ప్రాంతంలో కొండపై వెలసిన క్షేత్రపాలకొండ (శింగరప్ప కొండ) లక్ష్మీ చెన్న కేశవ స్వామి తిరునాళ్ల ఆదివారం కన్నుల పండువగా జరిగాయి. క్షేత్రపాల కొండపై లక్ష్మీ చెన్న కేశవస్వామితో పాటు నరసింహస్వామి, సత్య నారాయణ స్వామి, శివుడు, శింగరప్ప, ఆంజనే యస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. దీంతో ప్రతి ఏటా మాఘ మాసం మూడో ఆదివారం శింగరప్ప స్వామి తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరుగుతాయి. తిరునాళ్లకు మండలం నుంచే కాకుండా ఇతర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొండ అవరణమంతా భక్తులతో కిటకిటలాడింది.

భూ కబ్జాలకు పాల్పడితే పీడీ యాక్ట్: డీఎస్పీ

- మరో ఎనిమిది మందిపై కేసు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భూ కబ్జాలకు పాల్పడితే పీడీ యాక్టు ప్రయోగిస్తామని... దౌర్జన్యాలు, కబ్జాలకు పాల్పడితే ఎవరినీ వదలబోమని అనంతపురం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. భూ కబ్జాలకు పాల్పడిన ఐదుగురిపై శనివారం కేసు నమోదు చేసిన అనంతపురం త్రీటౌన్ పోలీసులు, మరో భూకబ్జాకు సంబంధించి ఆదివారం మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. నగరంలోని లెక్చరర్స్ కాలనీలో ఓ ప్రైవేట్ ల్యాండ్ ప్రహరీగోడ ధ్వంసం చేసి దౌర్జన్యంగా తాత్కాలిక గుడిసెలు వేసి కబ్జాకు పాల్పడిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. వీరితో పాటు సంబంధిత భూకబ్జాకు పాల్పడిన మరికొందరిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుం టామని డీఎస్పీ తెలిపారు. తాడిపత్రి పట్టణం సంజీవనగర్‌కు చెందిన చదల్ల సత్యనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, పోలు చంద్రరెడ్డి, వేంపల్లి రామమునిరెడ్డి అనే నలుగురు కలిసి లెక్చరర్స్ కాలనీలోని సర్వే నెంబరు 95/2ఏలో 66.50సెంట్ల భూమిని 2010 సంవత్సరంలో కంద్యాల జయలక్ష్మి నుంచి కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ భూమికి చుట్టూ ప్రహరీ నిర్మించి తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. ఈ నెల 2న కొంతమంది వ్యక్తులు ఆ భూమిలోకి ప్రవేశించి ప్రహరీని ధ్వంసం చేసి, తాత్కాలిక గుడిసె లు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న బాధితులు తమ భూమి వద్దకు వెళ్లగా, కొందరు వ్యక్తులు వారిని తిట్టి బెదిరించారు. చదల్ల సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో భూకబ్జా సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అక్రమంగా దౌర్జన్యంగా భూకబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, బంగారు కవచసేవ, పల్లకిసేవ ఆకుపూజ, అర్చనలు చేశారు. కుజదోష కాలసర్పదోష నివారణ కోసం హోమం నిర్వహించారు. లోకకల్యాణార్థం సూర్యనమస్కారాలు, అరుణహోమం నిర్వహించారు. మాఘమాసం మూడో ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.63 లక్షలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశువుల సంతతో రూ.3.63 లక్షల ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2.16 లక్షలు, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1.46 లక్షలు వచ్చిందని తెలిపారు.

జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా హ్యాండ్‌బాల్ బాలబాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా హ్యాండ్‌బాల్ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ధర్మవరంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాకే శివ శంకర్ తెలిపారు. ఎంపికైన బాలికల జట్టులో...ధనూష, గీతిక, లాస్య, లిఖిత, తన్మయి, రిషిక, ధనలక్ష్మి, హర్షవల్లి, మహేశ్వరి, మంజుల, మహిత, కీర్తి, హర్షప్రియ, తేజస్వని, నిజహాత్, మధుమతి ఉన్నారు. బాలుర జట్టులో... సాయికిరణ్, హరినాథ్‌బాబు, వినయ్, సిద్దీఖ్, ప్రసాద్‌నాయక్, జస్వంత్, నాగమహేష్, ధనుష్, వినోద్‌నాయక్, సాంబ, అశ్విన్ చౌదరి, రోహిత్, వినీత్‌రెడ్డి, కార్తీక్‌నాయక్, అశోక్, లోకేష్ ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఈ నెల 21 నుంచి కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని శివశంకర్ తెలిపారు.

ఉత్సాహంగా వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు


వెటరన్ బ్యాడ్మింటన్ పోటీల విజేతలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి వెటరన్ షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2025 పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో ఆదివారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, ఎంఎన్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వెటరన్ షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2025 పోటీలు నిర్వహించారు. డబుల్స్‌లో 35ప్లస్ క్యాటగిరీలో మల్లి- షాషా, 40ప్లస్‌లో ఎన్ శ్రీనివాసులు- వన్నూరప్ప, 45ప్లస్‌లో దేవరకొండ రామాంజి- ప్రతాప్ విజేతలయ్యారు. అలాగే 50ప్లస్ విభాగంలో లైబర్ రవీంద్రరెడ్డి- అగ్రికల్చర్ శ్రీనివాసరెడ్డి, 55ప్లస్‌లో వేణుగోపాల్- గోనుగుంట్ల విజయ్‌కుమార్ విజేతలుగా నిలిచారు. సింగిల్స్‌లో 35ప్లస్‌లో నరసింహ, 40ప్లస్‌లో దేవరకొండ రామాంజినేయులు, 45ప్లస్‌లో పులి ప్రతాప్, 50ప్లస్ లో షాషావలి, 55ప్లస్‌లో వేణుగోపాల్ గెలుపొందారు. జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, కార్యదర్శి జయకుమార్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలు రాష్ట్రస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీవీకేకే ప్రిన్సిపాల్ సుబ్బారావు, టోర్నీ కార్య నిర్వాహక కార్యదర్శి ఎంఎన్ స్పోర్ట్స్ నరేష్‌కుమార్, నరసమ్మ మెమోరియల్ ట్రస్టు రెడ్డప్ప, ఎన్‌వైకే శ్రీనివాసులు, హెచ్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత హెచ్ హనుమంతరెడ్డి, రామకృష్ణా రెడ్డి, షాషావలీ, భోగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైలార లింగేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ


ఆలయంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం మైలారలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు ఆలయ ప్రాంగణంలో పలు హోమాలు చేశారు. అనంతరం వేదమంత్రాల నడుమ, శాస్త్రోక్తంగా స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్వామివారిని దర్శించి పూజలు చేయించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిగింది. ప్రతిష్ఠ సందర్భంగా మూడురోజుల పాటు వివిధ పూజలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

మంజునాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బెళుగుప్ప: పట్టణంలోని మంజునాథస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే మళయాళ పండితుడు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరస్మోహంతంత్రి ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్చారణలతో మహా గణపతి హోమం, వాస్తు పూజ, ధ్వజ శుద్ధి, కలశ పూజ, విశేష దీపారాధన భగవతి సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం 11 గంటలకు ధ్వజ స్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు భోగేశ్వరస్వామి కల్యాణోత్సవం

పామిడి: పట్టణంలో వెలసిన భోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తుల సహకారంతో భోగేశ్వరస్వామి, ప్రసన్న పార్వతీ దేవి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు శివమాలధారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు మేషలగ్నంలో కల్యాణోత్సవాన్ని జరపనున్నట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పుట్లూరు, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపురం-కడవకల్లు గ్రామాల శివారులో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఇందులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.32,260 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు చెప్పారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని పాల వెంకటాపురం గ్రామంలో గల కొత్త కొండ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ నరేంద్రకుమార్ సిబ్బంది కలిసి దాడులు చేశారు. అందులో పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 15 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తాడిపత్రి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆలూరు గ్రామానికి చెందిన రంగనాయకులు (65)బార్బర్‌గా జీవనం సాగించేవాడు. కాగా ఆవులతిప్పాయపల్లి సమీపంలో ఉన్న ఓబులేసుకోనలో తలనీలాలు తీసేందుకు బైక్‌లో వెళ్లి పని అనంతరం తాడిపత్రికి వచ్చాడు. అక్కడ కొద్దిసేపు ఉండి తర్వాత స్వగ్రామానికి బయలుదేరాడు. సజ్జలదిన్నె వద్దకు రాగానే వెనుకవైపు నుంచి లారీ ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

బైక్‌ను కారు ఢీకొనడంతో బాలుడు..

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామ సమీపంలో బైక్‌ను కారు ఢీకొనడంతో దిమ్మగుడికి చెందిన సురేంద్రరెడ్డి, సులోచనమ్మ దంపతులకు తీవ్రగాయాలు కాగా వారి పెద్ద కుమారుడు రిత్విక్‌రెడ్డి(4) అక్కడికక్కడే మృతిచెందాడు. సురేంద్ర రెడ్డి కుటుంబ సమేతంగా బైక్‌లో అశ్వత్థం తిరుణాలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే చిత్రచేడు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

సహకార సంఘంలో సభ్యులుగా చేరండి

కూడేరు, ఫిబ్రవరి 16 : (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యులుగా చేరాలని ఇన్‌చార్జ్ సీఈఓ రామాంజనేయులు రైతులను కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ పొలమున్న రైతులు సహకార సంఘంలో సభ్యులుగా చేరడంతో అనేక లాభాలున్నాయని తెలిపారు. ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకు సభ్యులుగా చేరేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతోపాటు రూ.330 సభ్యత్వ రుసుం చెల్లించాలని ఆయన సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ మోసాలు అధికమయ్యాయని, అపరిచితుల నుంచి ఫోన్స్ కాల్స్ వస్తే జాగ్రత్త వహించాలని సీఐ జయనాయక్ ప్రజలకు సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఆయన సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫేక్ లోన్స్, యాప్స్‌లలో రుణాలు తీసుకోకూడదని తెలిపారు. ఇంటి వద్దనే పనిచేస్తూ సులువుగా డబ్బులను సంపాదించాలన్న ఆశ చూపించే ప్రకటనలు చూసి మోసపోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాలో బ్యాంక్ పేర్లతో, ప్రభుత్వ పథకాల పేర్లతో వచ్చే లింకులకు స్పందించకూడదని చెప్పారు. ఏపీకే ఫైల్స్ యాప్‌పై జాగ్రత్తగా ఉండాలన్నారు. మీకు కొరియర్ వచ్చిందని అందులో డ్రగ్స్ ఉన్నాయంటూ అపరిచిత వ్యక్తుల నుంచి ఫేక్‌కాల్స్ వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. స్టాక్ మార్కెట్‌పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని అలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఉంటే వెంటనే ప్రభుత్వం నిర్దేశించిన 1930కు కాల్ చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


లెక్చరర్లతో పూర్వ విద్యార్థులు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌సీపీ కాలేజీలో 2006-09వ సంవత్సరంలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం అదే కళాశాలలో గెట్‌టు గెదర్ నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తర్వాత కళాశాల ప్రిన్సిపాల్ మురళిని, లెక్చరర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 25 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఏటిగంగమ్మ తిరునాళ్ల

● జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన భక్తజనం


ప్రత్యేక అలంకరణలో ఏటిగంగమ్మ అమ్మవారు


పెన్నానదిలో స్నానమాచరిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం సమీపంలో గల పెన్నానది వద్ద ఏటిగంగమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. ప్రతియేటా మాఘమాసం మూడో ఆదివారం ఏటిగంగమ్మ తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అర్చకులు అక్కడి అశ్వర్థనారాయణ కట్టకు, ఏటిగంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలను చేశారు. తర్వాత అమ్మవారి ఉత్సవమూర్తిని మేళతాళాల మధ్య ఊరేగించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పెన్నానదిలో స్నానాలు ఆచరించి అశ్వర్థ నారాయణస్వామిని, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా ఖోఖో సంఘం చైర్మెన్ భీమిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

తిరునాళ్లలో జోరుగా మూడుముక్కలాట

ఏటి గంగమ్మ తిరునాళ్లలో మూడుముక్కలాట (పేకాట) జోరుగా సాగింది. ఆలయ సమీపంలోనే జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. నిర్వాహకులు దర్జాగా ఆటను నిర్వహించారు. ఇందులో మైనర్లు కూడా పాల్గొనడం గమనార్హం.

బూదిగుమ్మలో..

బెళుగుప్ప: మండలంలో రామసాగరం సమీపంలో బూదిగుమ్మ తిరునాళ్ల ఘనంగా జరిగాయి. మూడురోజులపాటు నిర్వహించిన తిరునాళ్ల ఆదివారం ముగిశాయి. బూదిగుమ్మ, కాలవపల్లి, వీరాంజనేయ కొట్టాల తదితర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి స్థానిక పెన్నానదిలో మాఘ స్నానం ఆచరించి అక్కడి ఆంజనేయస్వామి, వెంకటరమణస్వామి ఆలయాల్లో స్వామివార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. మిఠాయిలు, గాజులు, ఆటవస్తువుల దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. ఆలయం వద్ద సిప్లాస్ గ్రూపు చైర్మన్ రాళ్లపల్లి అనంతయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. రెండు ఆలయాల చైర్మన్లు యర్రిస్వామి, శంకరప్ప, టీడీపీ నాయకులు నారాయణస్వామి, ఎర్రేగౌడ, సంజీవులు, అర్చకులు జ్ఞానేశ్వర స్వామి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేకాలంకరణలో బూదిగుమ్మ ఆంజనేయస్వామి

సింగరప్ప స్వామి సన్నిధిలో..

పామిడి: పెన్నానది ఒడ్డున క్షేత్రపాల కొండలో వెలసిన సింగరప్ప స్వామి ఆలయం వద్ద తిరుణాల ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజామున అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేపట్టారు. మాఘమాసం మూడో ఆదివారం ఇక్కడ తిరుణాల జరగడం ఆనవాయితీగా వస్తోందని భక్తులు తెలిపారు. పెన్నానదిలోని ఉత్తర దక్షిణ దశలకు పారుతున్న ఊటకాలువల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.


సింగరప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా శ్రీకృష్ణదేవరాయుల జయంతి

గుంతకల్లుటౌన్/ గుంతకల్లు ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల 544వ జయంతిని పట్టణంలోని బలిజ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక 60అడుగుల రోడ్డులో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయుల పాలన సుభిక్షంగా ఉండేదన్నారు. ఆయన పాలనలోనే రాష్ట్రంలో ఎన్నో ఆలయాలు, చెరువులు నిర్మితమయ్యాయని కొనియాడారు. అలాగే దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలుగు గొప్పతనాన్ని చాటిన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విశ్వనాథ్, బెల్లం రాజు, అనిల్‌కుమార్, గాజులపవన్‌కుమార్, రాఘవేంద్ర, రంగారాయల్, జనసేననాయకులు వాసిగిరిమణికంఠ, ప్రసాద్, మల్లయ్య, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే బలిజ సంఘ పట్టణాధ్యక్షుడు పూల రమణ, టీడీపీ నాయకులు కూడా స్థానిక రాయల వారి విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, ఏజీపీ హేమాద్రి వక్కల ఉమ, వనజ, స్రవంతి, శ్రీదేవి, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డు సర్కిల్లో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి బలిజ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సంఘం నాయకులు మారాకుల రమణ, మంజునాథ్, ఈశ్వరయ్య, శ్రీకరంవెంకటేశులు, బండి సత్యనారాయణ పాల్గొన్నారు.

యాడికి: మండలకేంద్రంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి బలిజ సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప సర్పంచు చంద్రమోహన్, జనసేన మండల కన్వీనర్ సునీల్, బలిజ సంఘం నాయకుడు రాయుడు తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో కేక్ కట్ చేస్తున్న బలిజసంఘం నాయకులు

రాయదుర్గంరూరల్: శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా పట్టణంలోని బలిజలు స్థానిక ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయం వద్ద నుంచి మొలకాల్మూరు బస్టాండ్, వినాయకసర్కిల్ మీదుగా పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. బలిజ సంఘం పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి కోదండ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పూజారి శివప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెన్నహోబిలంలో ప్రత్యేక పూజలు

ఉరవకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. సమీపంలో ఏటిగంగమ్మ తిరునాళ్ల ఉండడంతో అక్కడికి వచ్చిన భక్తులంతా పెన్నహోబిళం స్వామిని దర్శించుకున్నారు. మరోవైపు పెళ్లిళ్లు కూడా భారీగా ఉండడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది.


ప్రత్యేక అలంకరణలో మూల విరాట్

చిరుత దాడిలో గేదె దూడ మృతి

శెట్టూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లి గ్రామంలో శ్రీనివాసులుకు చెందిన గేదె దూడను శనివారం రాత్రి చిరుత దాడి చేసి చంపేసింది. గ్రామ సమీపంలో పశువుల పాకలో కట్టేసి ఉన్న పశువుల మందపై చిరుత ఒక్కసారిగా దాడి చేసింది. అందులో గేదె దూడను పొదలచాటుకు ఎత్తుకెళ్లి చంపేసింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఆదివారం మాట్లాడుతూ.. అటవీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతోందని మండిపడ్డారు. ఇదే గ్రామంలోని మేకలు, గొర్రెలు, ఆవులపై చిరుత తరచూ దాడులు చేస్తోందని, అయినా ఇంతవరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. గేదె దూడను కోల్పోయిన రైతును ఆదుకోవాలని కోరారు.

కొండకు నిప్పు

కుందుర్పి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కెంచంపల్లి గ్రామ సమీపంలో అడవికి గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం నిప్పు పెట్టారు. దీంతో మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. అక్కడి సమీపంలో గ్రామానికి చెందిన మారుతి బైక్‌ను పార్క్ చేయగా.. మంటల్లో పూర్తిగా కాలిపోయింది. అదేవిధంగా చుట్టుపక్కల ఉన్న పొలాల్లోని 90 పండ్ల చెట్లు, డ్రిప్ పరికరాలు, మొక్కజొన్న పంట కాలిపోయినట్లు బాధిత రైతులు వాపోయారు.

పంట దగ్ధం: రూ.20 లక్షల నష్టం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగి చెరుకు పంట దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని బండూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు తిమ్మప్ప, రాఘవేంద్ర, ఎర్రితాత 16 ఎకరాలు కౌలుకు తీసుకుని చెరుకు పంట సాగు చేశారు. అయితే ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఒకదానికొకటి రాసుకోవడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి చెరుకు పంటకు మంటలు వ్యాపించాయి. దీంతో 16 ఎకరాల్లోనూ పంట అగ్నికి ఆహుతైంది. అలాగే విద్యుత్ మోటార్, స్టార్టర్ బాక్స్ కాలిపోయాయి. దీంతో సుమారు రూ. 20 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఇలా జరిగిందని ఆవేదన చెందారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, సరి చేయాలని ఏడాది నుంచి కోరుతున్నా.. ఎవరూ స్పందించలేదని మండిపడ్డారు. ఇప్పుడు పంటంతా బూడిదైందని విలపించారు. జరిగిన నష్టంపై అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

పాత క్లస్టర్ కాంప్లెక్స్ విధానాన్ని అమలుచేయాలి

యాడికి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నూతన క్లస్టర్ కాంప్లెక్స్ విధానం ఉపాధ్యాయులను గందరగోళానికి గురి చేస్తున్నదని, పాత క్లస్టర్ కాంప్లెక్స్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసయాదవ్ ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ అధికారులు శనివారం నిర్వహించిన నూతన క్లస్టర్ విధానం ఉపాధ్యాయుల్ని గందరగోళానికి గురి చేస్తున్నదని తెలిపారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా పాత క్లస్టర్ కాంప్లెక్స్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు.

భూకబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భూకబ్జాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, పీడీ యాక్టు ప్రయోగిస్తామని రాయదుర్గం అర్బన్ సీఐ జయనాయక్ హెచ్చరించారు. భూకబ్జాకు పాల్పడిన తొమ్మిది మందిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని ప్యాలెస్ రోడ్ పక్కన సర్వే నెంబరు 232లో ఉన్న 13.55 ఎకరాల భూమి ప్రైవేటు స్థలాన్ని కబ్జా చేసి షెడ్లు నిర్మిస్తున్న తొమ్మిది మందిపై భూ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. వీరితో పాటు భూకబ్జాకు పాల్పడిన మరి కొందరిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా భూకబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

బాలుడికి తప్పిన ప్రాణాపాయం

●పెన్నానదిలో మునిగిపోతుండగా కాపాడిన తోటి బాలురు

బెళుగుప్ప, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బూదిగుమ్మ తిరునాళ్లలో ఓ బాలుడికి ప్రాణాపాయం తప్పింది. ఉరవకొండ మండలం రాంపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, కవితమ్మ దంపతులు కుమారుడు పవన్‌కుమార్‌తో కలిసి ఆదివారం బూదిగుమ్మ తిరుణాళ్లకు వచ్చారు. అక్కడి పెన్నానదిలో స్నానం చేస్తుండగా ఆ బాలుడు నీటమునిగాడు. అక్కడే ఉన్న కొందరు బాలురు ఇది గమనించి సాహసం చేసి ఆ బాలుడిని కాపాడి బయటికి తీసుకొచ్చారు. అనంతరం అక్కడే ఉన్న వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి 108లో కళ్యాణ దుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. బాలుడికి ఎలాంటి అపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌కుమార్

లాభాల బాటలో కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్

● బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్

గుత్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ది గుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లాభాల బాటలో పయనిస్తోందని ఆ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్ఎస్‌రోడ్డులో గల వసుధ ఫంక్షన్ హాల్లో ఆదివారం టౌన్ బ్యాంక్ 102వ మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌జిలాన్ మాట్లాడుతూ.. బ్యాంకులో డిపాజిట్లు రూ. 11,916లు ఉండగా, షేర్ క్యాపిటల్ రూ. 596,30లక్షలు, షేర్ హోల్డర్లు 4446 మంది ఉన్నారన్నారు. బ్యాంకు సొంత నిధి రూ.1771.35 కోట్లు ఉందన్నారు. వ్యాపారం రూ.21.970కోట్లు ఉండగా.. బ్యాంక్ ఆదాయం రూ310.20 కోట్లు ఉందన్నారు. షేర్ క్యాపిటల్ రూ.18కోట్లకు పెంచుకోవడానికి ఆర్‌సీఎస్ అనుమతి కోరామని చెప్పారు. గుంతకల్లు, డోన్, కదిరిలలో నూతన బ్రాంచ్‌ల ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి కోసం పంపించామన్నారు. అనుమతులు రాగానే నూతన బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవహారిక విస్తీర్ణణాన్ని 5జిల్లాల నుంచి 8 జిల్లాలకు విస్తరించేందుకు ఆర్‌సీఎస్ అనుమతి కోరామన్నారు. ఎఫ్ఎస్‌డబ్ల్యూఎం నిబంధనల మేరకు రాయదుర్గంలో నూతన బ్రాంచ్ ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి కోరామన్నారు. ఖాతాదారులు తమ బ్యాంకులో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. రైల్వే ఉద్యోగులు, ఖాతాదారుల సౌకర్యార్థం గుత్తి, పామిడి, గుత్తిఆర్ఎస్ శాఖలలో ఏటీఎం సౌకర్యం కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రామ్మోహన్, సీఈఓ మహేశ్వర ప్రసాద్, డైరెక్టర్లు నాగరాజు, మధుసూదన్‌గుప్తా, కృష్ణ, వెంకటేష్, జక్కావీరన్న, దాదా, కే నాగరాజు, రంగప్రసాద్, సీ నాగరాజు, వెంకటేష్, మహబుబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు

కోనాపురం చెరువుకు నీటి విడుదల

ఉరవకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు సమీపంలోని హంద్రీనీవా కాలువ నుంచి కోనాపురం చెరువుకు ఆదివారం టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు నీటిని విడుదల చేశారు. కాలువ వద్ద టీడీపీ నాయకులతో కలిసి గంగపూజ నిర్వహించి నీరు వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ హంద్రీనీవా జలాలతో నింపుతామని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, నాయకులు రామాంజనేయులు, గుర్రం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘన జీవామృతంపై అవగాహన

బెళుగుప్ప, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రసాయనాలు లేని ఘన జీవామృతంతో పంటలు సాగు చేస్తే లాభసాటి దిగుబడులు పొందవచ్చని డీపీఎంయూ నేచురల్ ఫార్మింగ్ అసిస్టెంట్ భానుమతి సూచించారు. మండలంలోని శ్రీరంగాపురంలో ఆదివారం ఆమె ఘన జీవామృతంతో చిరుధాన్యాల సాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు. తొలుత గ్రామంలో పలు పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఘనజీవామృతంతో నేల సారవంతంగా మారుతుందన్నారు. వర్షాలు లేకున్నా పైరు తట్టుకోగలదని వివరించారు. రైతులు ఘన జీవామృతంతో పంటల సాగు చేయడంపై దృష్టిసారించాలని కోరారు. సర్పంచ్ మారుతీరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హంపయ్యకాలనీలో ఆదివారం మహమ్మద్‌పై సాయి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కాలనీలో ఓ ఇంటి ముందర మహమ్మద్ ఉండగా.. మద్యం సేవించి వచ్చిన సాయి రాత్రి పూట ఇక్కడ ఎందుకు తిరుగుతున్నావని గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఇనుప రాడ్డు తీసుకుని తలపై కొట్టాడు. దీంతో మహ్మద్ గాయపడగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు సాయిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇరు కుటుంబాల ఘర్షణ

గుత్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని రౌవూఫ్ కాంపౌడ్ ఏరియాలో ఇంటి ముందర చెత్త పడేసే విషయంలో ఇరుకుటుంబాల మధ్య గొడవ జరిగి ఘర్షణకు దారితీసింది. ఇంటి ముందర చెత్తపడేశారని వంశీ, అతడి తల్లి సాయమ్మ పక్కింటిలోని రిజ్వాన, రసూల్‌తో గొడవకు దిగారు. ఈ క్రమంలో ఘర్షణపడి కొట్టుకున్నారు. రసూల్, సాయమ్మలు గాయపడగా.. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పు

యల్లనూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి సరఫరా అయ్యే విద్యుత్‌వేళల్లో మార్పు జరిగినట్లు ఏఈ రవీంద్ర ఆదివారం తెలిపారు. యల్లనూరు, తిరుమలాపురం ఫీడర్లకు తెల్లవారుజామున 3 నుంచి 6గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. అలాగే పెద్దమల్లేపల్లి, వేములపల్లి ఫీడర్లకు తెల్లవారుజామున 3 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. రైతులు గమనించాలని సూచించారు.

నాటుసారా ఊట ధ్వంసం

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంచానపల్లి గ్రామంలో నాటుసారా తయారీ స్థావరాలపై ఆదివారం దాడులు నిర్వహించి నాటుసారా తయారీకి ఉపయోగించే ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. నాటుసారా తయారీకి వాడే మొత్తం 90 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి తయారీదారులపై కేసు నమోదు చేశామన్నారు. దాడులలో ఎస్ఐ పవన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు: సీఐ

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడైనా ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి ఉచిత ఇసుకను అందించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగానే స్థానికంగా ఉన్న వంకలు, వాగుల ద్వారా ఇసుకను స్వయంగా లబ్ధిదారులు ఎడ్లబండ్ల ద్వారా రవాణా చేసుకునేందుకు వీలు కల్పించిందన్నారు. కానీ కొంతమంది అక్రమమార్కులు దీనిని అదనుగా చేసుకొని ఇసుకను డంపు చేసుకొని టిప్పర్ల ద్వారా రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారని మండిపడ్డారు. గత వారంరోజులుగా మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో చాలా చోట్ల ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేశామని చెప్పారు. ఎక్కడైనా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఏఎస్ఐ రామ్మోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి తిప్పలు

● వారం రోజులుగా సరఫరా కాని సత్యసాయి, శ్రీరామిరెడ్డి నీరు

● దాహార్తితో అల్లాడుతున్న ప్రజలు

కుందుర్పి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గ్రామాల్లో శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు దాహార్తితో విలవిల్లాడుతున్నారు. ఆయా గ్రామాల్లోని బోర్లలో వచ్చే నీటిలో అధికంగా ఫ్లోరైడ్ ఉంటోంది. దీంతో అవి తాగడానికి పనికిరావు. కనుక శ్రీరామిరెడ్డి, సత్యసాయి నీరే ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. వారం రోజులుగా వివిధ కారణాలతో ఆ నీరు సరఫరా కాలేదు. దీంతో గ్రామీణ ప్రజలు అల్లాడుతున్నారు. చేసేదిలేక చాలా మంది సుదూరంలోని వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుని కాలం గడుపుతున్నారు. ఇక చాలామంది మినరల్ వాటర్‌ను బిందె నీళ్ల 10 రూపాయల చొప్పు న కొనుగోలు చేస్తున్నారు. అందుకు కూడా ట్యాంకర్ వద్ద ఎగబడుతూ నానా తంటాలు పడుతున్నారు. ఇదిలా ఉండగా తెనగల్లు గ్రామాల్లో ఆది, సోమవారాల్లో రథోత్సవ వేడుకలు ఉండటంతో ఆ గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు.


కరిగానపల్లిలో ట్యాంకర్ వద్ద నీటి కోసం ఎగబడుతున్న మహిళలు